బీఆర్ఎస్ నాయకులకు మాజీ మంత్రి పరామర్శ

బీఆర్ఎస్ నాయకులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, మే 20: పట్టణంలోని అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు బీఆర్ఎస్ నాయకుల ఇంటికి వెళ్లి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. మర్రికుంట 9వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు శాంతన్న, వార్డు ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ గుండెనొప్పితో చికిత్సపొంది విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కార్యకర్తలతో కలిసి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, నాయకులు నర్సింహా, మాధవ్‌రెడ్డి, జాతృనాయక్, శ్రీను, గోవర్ధన్‌సాగర్, శంకర్‌నాయక్, బాలకృష్ణ, నరేశ్, రాము, ప్రేమ్, చిన్నారెడ్డి, రాజూనాయక్, బాబూనాయక్, చందూనాయక్ పాల్గొన్నారు.

బాధితులకు ఎల్ఓసీ అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల

గద్వాల అర్బన్, మే 20: గట్టు మండలంలోని బోయాలగూడెంకు చెందిన చిన్నన్న మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. చిన్నన్నకు సీఎం సహాయనిధి నుంచి రూ.లక్షా పదివేలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని చిన్నన్న కుటుంబ సభ్యులకు అందజేశారు.

రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎత్తిపోతలను పునరుద్ధరిస్తాం
- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి
- కురుమూర్తిరాయ ఎత్తిపోతల పథకం పరిశీలన

కురుమూర్తి రాయ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురం, మే 20: కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వమని.. తమ ప్రభుత్వం ఎప్పుడూ రైతుల పక్షాన నిలబడుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రామన్‌పాడు-1, రామన్‌పాడు-2, సరళాసాగర్, కురుమూర్తిరాయ ఎత్తిపోతల పథకాలను ఇరిగేషన్ అధికారులు, మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఎత్తిపోతల పథకాలు, వాటికింద మోటర్లు శిథిలావస్థకు చేరి ఆయకట్టుకు సాగునీరు అందక ఎత్తిపోతల పథకాల కింద ఉన్న సుమారు 10వేల ఎకరాలకు బీడు పడ్డాయన్నారు. ఎత్తిపోతలను పునరుద్ధరించి మోటర్లకు మరమ్మతులు చేయించి, అవసరమైన చోట కొత్త మోటర్లు బిగించి ఆయకట్టు రైతాంగానికి సాగునీరు అందజేస్తామన్నారు. బీడు భూములను సాగుభూములుగా మలిచి రైతు కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా తాగునీటి అవసరాల కోసం తమ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి జూరాలకు ఒక్క టీఎంసీ నీటిని విడుదల చేయించుకున్నామని ఇది తమ ప్రభుత్వ నిబద్ధత అని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతును అన్నివిధాలా ఆదుకుంటాం

కొత్తకోట, మే 20: పట్టణానికి చెందిన రైతు శరత్‌చంద్రారెడ్డి 40 ట్రాక్టర్ల గడ్డి వాము ఆదివారం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సోమవారం ప్రమాదస్థలాన్ని పరిశీలించి రైతును పరామర్శించారు. ప్రభుత్వపరంగా అన్నివిధాలా ఆదుకుంటామని రైతుకు ధైర్యం చెప్పారు. ఇటీవల మాజీ ఎంపీటీసీ రాంచంద్రయ్య తండ్రి జనార్దన్‌గౌడ్ మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని కూడా పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పీజే బాబు, కృష్ణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీను, సాయన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌కు పాల్పడుతున్నవారిపై కేసు నమోదు

గద్వాల అర్బన్, మే 20 : క్రికెట్ బెట్టింగ్‌కు ఆడుతున్న నలుగురిని పట్టుకున్న ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. గద్వాల టౌన్ ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పిల్లిగుండ్ల కాలనీకి చెందిన అనిల్‌కుమార్, ఈశ్వర్, వడ్డేపల్లికి చెందిన రాకేశ్, నాగరాజు బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. సోమవారం వీరిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బెట్టింగ్ చట్టరీత్యా నేరమని, బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

వేసవి దుక్కులు.. ఎన్నో లాభాలు..

- సూచనలు చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

దుక్కి దున్నుతున్న రైతన్న

మల్దకల్, మే 20 : రైతులు వేసవి దుక్కులతో పంటలో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. రైతులు సాగు చేసిన పంటలో అధిక దిగుబడి సాధించాలంటే సాగు ప్రారంభ దశలో కొన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. త్వరలో వానకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు వేసవి దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలను వ్యవసాయ శాఖ అధికారులు వివరిస్తున్నారు.

పురుగులు నశిస్తాయి..

రైతులు పొలాలను నిలువుగా కాకుండా ఏటవాలుగా దున్నుకోవాలన్నారు. దీంతో నేల గుల్లబారి భూమి లోపల ఉంటే పురుగు గుడ్లు, లార్వా నశించి పోతాయన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి..

రైతులు తమ పొలాల్లో ఎండాకాలంలో కురిసే తొలి వర్షాలకు వేసవి దుక్కులు దున్నుకోవడంతో ఎన్నో లాభాలు ఉంటాయి. వేసవి దుక్కులు దున్నడం వల్ల భూమిలో ఉండే విషవాయువులు మొత్తం నాశనమవుతాయి. క్రిమి సంహారక మందులు, రసాయనిక ఎరువులు వాడడం కూడా చాలా వరకు తగ్గుతాయి. ముఖ్యంగా ఈ దుక్కిలో సేంద్రియ ఎరువులు వాడితే భూసారం శక్తి వంతంగా ఉంటుంది. రైతులు పొలాల్లోని మట్టిని పరీక్షించి వ్యవసాయాధికారులు సూచనలు ప్రకారం పంటలు సాగు వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

-రాజశేఖర్, ఏవో

పంట దశలో కలుపుతోపాటు క్రిమి కీటకాల బెడద చాలా వరకు తగ్గుతుంది. అంతే కాకుండా ఏటవాలుగా దున్నడంతో అడపా దడపా కురిసే వర్షాలకు నీరు భూమిలోకి నేరుగా ఇంకి పోతుందన్నారు.

పోషకాల పెరుగుదల..

వేసవిలో భూమిని బాగా లోతుగా దున్నడంతో నేల లోపలి భూమి గట్టి పొరలు పగిలిపోతాయి. దీంతో విత్తనాలు వేసిన తర్వాత మొక్కలు వేర్లు భూమిలోకి చొచ్చుకొని వెళ్లడంతో వేరుకు కావాల్సిన పోషకాలు సమకూరుతాయి. పంటలకు మేలు చేసే సూక్ష్మజీవుల చర్యలను అభివృద్ధి చేయటానికి కూడా ఈ వేసవి దుక్కులు బాగా ఉపయోగ పడతాయి.

కలుపును నివారించవచ్చు..

వేసవిలో లోతుగా దుక్కులను దున్నడంతో గరిక తుంగ, తదితర పిచ్చి మొక్కలు, దుంపలతో సహా పెకిలించబడతాయి. దీంతో పంట దశలో కలుపు సమస్యను చాలా వరకు తగ్గించుకోవచ్చు. అలాగే పైరుకు ఆశించే క్రిమి కీటకాలు కూడా చనిపోవడంతో తెగుళ్ల సమస్య తగ్గే అవకాశం ఉంటుంది.



అల్లీపీరును పరామర్శిస్తున్న మాజీ ఎంపీ రావుల

కార్యకర్తను పరామర్శించిన మాజీ ఎంపీ రావుల

పెబ్బేరు, మే 20: మండలంలోని యాపర్లకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అల్లీపీరును మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అనారోగ్య కారణాలతో అల్లీపీరుకు ఇటీవల శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో రావుల బాధితుడి ఇంటికెళ్లి ఆరోగ్యంపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ వైస్‌చైర్మన్ కర్రెస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు, నాయకులు రాజశేఖర్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

ఎర్రవల్లి చౌరస్తా, మే 20 : రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఏఎస్సై వెంకటేశ్వర్లు కథనం మేరకు చాగాపురం గ్రామానిక చెందిన వడ్డె మోహన్(24) ఆదివారం తన బైక్‌పై ఎర్రవల్లికి వెళ్లాడు. పని ముగించుకొని తిరుగు ప్రయాణంలో చాగాపురం శివారు వద్ద ప్రమాదవశాత్తు కిందపడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు మోహన్‌ను కర్నూల్ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. సోమవారం భార్య ఉమ ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెబ్బేరు, మే 20: పట్టణంలోని జూరాల ప్రధాన ఎడమ కాల్వలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైందని ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. సుమారు 50ఏండ్ల మధ్య వయస్సు ఉంటుందని తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తు పడితే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులకు నష్టపరిహారం అందిస్తాం

పాన్‌గల్, మే 20: కాల్వల్లో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని భూసేకరణ స్పెషల్ డిప్యూటీ తాసీల్దార్ నాగరాజు, జిల్లా సర్వేయర్ అబ్దుల్ అహ్మద్, ఎంపీటీసీ సుబ్బయ్య యాదవ్ అన్నారు. మండలంలోని శాగాపూర్ ఎంజీకేఎల్ఐ కాల్వలో 15 మంది రైతులు భూములు కోల్పోయినట్లు తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా మంత్రి, కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సోమవారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారికి నోటీసులు ఇవ్వడంతోపాటు అవార్డు పాస్‌కోసం సంతకాలు సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర్లు, మైనుద్దీన్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, రైతులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి

వనపర్తి, మే 20: మండలంలోని కిష్టగిరిలో సోమవారం కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతి చెందిన ఘటన చోటుచేసుకున్నది. మాసన్నకు 25గొర్రెల పిల్లలపై కుక్కలు దాడి చేసి చంపేశాయని ఆవేదన వ్యక్తం చేశాడు. దాదాపుగా రూ1.50లక్షల విలువైన గొర్రెపిల్లలను కోల్పోయినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆర్థికం సాయం చేసి ఆదుకోవాలని కోరారు.

వెయ్యి బీడీలకు రూ.250 కూలి ఇవ్వాలి

అమరచింత, మే 20: పొద్దస్తమానం కష్టపడి పనిచేసిన బీడీ కార్మికులు పూట గడవక పస్తులు ఉంటున్నారని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా యాజమాన్యాలు వెయ్యి బీడీలకు రూ.250 కూలి ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సూర్యం, సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బీడీ కార్మికుల జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సామేల్ అధ్యక్షత వహించగా.. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు హాజరై మాట్లాడారు. రెండు నెలల నుంచి బీడీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో యాజమాన్యాలతో బీడీ కూలి రేట్లు పెంచాలని పలుమార్లు చర్చలు జరపగా.. వారు మొండి వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లను పెంచే వరకు కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం నాయకులు దేవదాసు, ప్రసాద్, ప్రేమరత్నం, కురుమన్న, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ సంతోష్

గద్వాల, మే 20: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు వైద్యశాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటైన ఉండవెల్లి, ఎర్రవల్లి, కేటీ దొడ్డి మండలాల్లో పీహెచ్‌సీల ఏర్పాటుకు స్థలాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న సబ్ సెంటర్ల వివరాలు కూడా తెలియపర్చితే వాటికి కూడా కొత్త భవనాలు నిర్మించనున్నట్లు వివరించారు. రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలైన టీబీ, మలేరియా, ఎయిడ్స్ ఇమ్యూనైజేషన్, మాత శిశు సంరక్షణ, సంక్రమిత వ్యాధులపై జిల్లాలో చేపడుతున్న చర్యలపై సమీక్షించారు.

జిల్లాలో నిర్వహిస్తున్న ప్రైవేట్ దవాఖానలు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు తదితర రిజిస్ట్రేషన్ అంశాలపై చర్చించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో శశికళ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సిద్ధప్ప, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిప్ ద్వారా అభ్యర్థుల ఎంపిక

- అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

డిప్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తున్న అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

గద్వాల, మే 20: గద్వాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేసేందుకు వివిధ పోస్టులకు వచ్చిన దరఖాస్తుల నుంచి అర్హులైన అభ్యర్థులను నిబంధనల ప్రకారం ఎంపిక చేసినట్లు అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయంలో ఆయా పోస్టులకు సంబంధించి జిల్లా సెలక్షన్ కమిటీ అధ్యక్షుడు కలెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు అధికారులు అభ్యర్థులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో ఎంపిక చేసేందుకు మొత్తం 24 పోస్టులకు 2,370 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఇందులో 11డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు 11 ఉండగా 672 మంది, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు 9 ఉండగా 1,483 మంది, మూడు ల్యాబ్ అటెండర్ పోస్టులకు 201 మంది, ఒక థియేటర్ అసిస్టెంట్ పోస్టుకు 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో రోస్టర్ ప్రకారం రిజర్వేషన్ల వారీగా అభ్యర్థులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కాంతమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్‌బాబు, ఉపాధి కల్పన అధికారి ప్రియాంక పాల్గొన్నారు.

హరితహారానికి మొక్కలను సిద్ధం చేయాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

అంకూర్‌లో నర్సరీ ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి, మే 20: ప్రతి గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు నర్సరీల్లో సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. సోమవారం మండలంలోని అంకూర్ పంచాయతీలోని నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డు, క్రిమిటోరియంను డీఎల్‌పీవో రఘునాథ్‌రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో మొక్కలను నాటేందుకు నర్సరీల్లోని మొక్కలను సిద్ధం చేసుకోవాలని, గ్రామంలో సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్డులో పొడి , తడిచెత్తను ఎప్పటికప్పుడు వేరు చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో పరిశుభ్రతను పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మురుగు కాల్వలను క్రమం తప్పకుండా శుభ్రపర్చాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న జీపీ రికార్డును అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవ, ఎంపీవో సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని సకాలంలో గుర్తించాలి

- క్షయ నియంత్రణ జిల్లా ఇన్‌చార్జి అధికారి వంశీకృష్ణ

శిక్షణలో మాట్లాడుతున్న నియంత్రణ అధికారి వంశీకృష్ణ

పెబ్బేరు, మే 20: క్షయ వ్యాధిని సకాలంలో గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని క్షయ నియంత్రణ జిల్లా ఇన్‌చార్జి అధికారి వంశీకృష్ణ అన్నారు. సోమవారం పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి నియంత్రణపై వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్షయ వ్యాధి వ్యాప్తి చెందకుండా రోగులకు మందులతోపాటు సలహాలు ఇవ్వాలని చెప్పారు. అలాగే టీబీ కేసులు తక్కువగా ఉన్నందున సిబ్బంది తమ లక్ష్యాలను సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు జోషి, బాసిత్‌ఖాన్‌తోపాటు వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

- అదనపు కలెక్టర్ నగేశ్

గోపాల్‌పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

గోపాల్‌పేట, మే 20: రైతులు పండించిన ధాన్యం తడిచిపోకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ నగేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో ఐకేపీ, సింగిల్ విండో ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. మిగిలిన ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచాలని సూచించారు.

విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ రితిరాజ్

విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకోవాలి

- ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, మే 20: విద్యార్థి దశ నుంచే జీవిత లక్ష్యాలను ఎంచుకొని ప్రణాళికతో చదువుతూ ముందుకెళ్లాలని ఎస్పీ రితిరాజ్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబాలకు చెందిన 10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమని, ఆ సమయంలో ఎలాంటి చెడుమార్గాల వైపునకు వెళ్లకుండా మహనీయుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు.

పోలీస్ ప్రజావాణికి 14 ఫిర్యాదులు

వనపర్తి టౌన్, మే 20: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 14 ఫిర్యాదులు అందాయని అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్ తెలిపారు. జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఆయన స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని కిందిస్థాయి అధికారులకు సూచించారు. పరస్పర గొడవలకు సంబంధించి 6, భార్యాభర్తలకు సంబంధించి 4, భూతగాదాలకు సంబంధించి 4ఫిర్యాదులు అందాయన్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

అమరచింత, మే 20: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం ఆయన ఎంపీవో నర్సింహయ్యతో కలిసి మండలంలోని పాంచెడ్డిపల్లి, సింగంపేటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీలు, శానిటేషన్ పనులను పరిశీలించి పంచాయతీ కార్యకర్తలకు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. దంచి కొడుతున్న ఎండలతోపాటు, తెలంగాణలో మూడు రోజులపాటు భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన క్రమంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా రూ.లక్షల వెచ్చించి ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరు పట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రామాంజనేయులు, శ్రీనివాసులు తదతరులు ఉన్నారు.

దుకాణాల్లో తనిఖీ

వనపర్తి, మే 20: జిల్లాలోని పలు పెట్రోల్ బంక్‌లు, కూరగాయలు, చికెన్ షాపుల్లో తూనికలు, కొలతలు శాఖ జిల్లా అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీ చేపట్టి 4 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సోమవారం ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా పెట్రోల్ బంకుల్లో వాహనాల్లో పెట్రోల్ పోయించుకునే సమయంలో రీడింగ్ సున్నా చూసుకోవాలని, పెట్రోల్‌లో తేడా అనిపిస్తే బంక్ ల్లో డిపార్ట్‌మెంట్ చేత సరిచేయబడిన 5ఎంఎల్ మెసర్‌తో చెక్ చేసుకోవచ్చన్నారు. అలాగే డీజిల్, పెట్రోల్ తేడా అనిపిస్తే బంకుల్లోనే ఫిల్టర్ పేపర్ ఉంటుందని, దానిపై ఒక చుక్క వేసి పేపర్‌పై ఎంతవరకు మరక వచ్చిందో చూసి రౌండ్ చేసి, ఒక నిమిషం తర్వాత ఆ మరక అలాగే కనిపిస్తే కల్తీగా గుర్తించాలని, కనబడకపోతే కల్తీ లేదని గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో తూనికలు, కొలతల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినం

వనపర్తి, మే 20: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో సోమవారం అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినోత్సవాన్ని ఎయిడ్స్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌వోడీ డాక్టర్ ఎన్ఎం ప్రసాద్ మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఇబ్రహీం, నాగరాజు, రాధాకృష్ణ, స్వచ్ఛంద సంస్థలు, హోపీ సంస్థ, లింక్ వర్కర్స్ ప్రాజెక్ట్, యూఆర్‌జీ కేర్ సంస్థ, వివాన్ సంస్థ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, మే 20: 2024-25 విద్యా సంవత్సరానికిగానూ బెస్ట్ అవేలబుల్ పాఠశాలల్లో 3, 5, 8వ తరగతుల్లో ప్రవేశాలకు గిరిజన బాల, బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 21నుంచి జూన్ 6వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షా50వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలలోపు ఉండాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో లభిస్తాయని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో జూన్ 6వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా దరఖాస్తుతోపాటు కులం, జనన, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బోనఫైడ్,